సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

జిల్లా కేంద్రమైన పాడేరులో గురువారం ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి పరీక్ష నిర్వహించారు. IIలో



చందనోత్సవానికి ఏర్పాట్లు

సింహాచలం సింహగిరిపై చందనోత్సవం రోజున భక్తులకు ఇబ్బంది లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. IIలో



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: నగరంలో బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ నేత పార్వతమ్మ

- ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో చేరిక
- పార్టీ కండువా వేసి ఆహ్వానం



పార్వతమ్మకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.చిత్రంలో విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నేత, మాజీ జీసీసీ డీఎం కురుసా పార్వతమ్మ వైఎస్సార్‌సీపీలో చేరారు. వెఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఆమె బుధవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో సీఎంను కలిశారు. ఆమెకు జగన్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, అన్నివర్గాల ప్రజలకు జరిగిన మేలు, గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం తనను ఎంతగానో ఆకర్షించాయన్నారు. దీనిలో భాగంగానే వైఎస్సార్‌సీపీలో చేరినట్టు ఆమె తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌తోపాటు పాడేరు, అరకు, రంపచోడవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వారికి మద్దతుగా ప్రచారం చేస్తానని ఆమె తెలిపారు.

ముగిసిన తొలి ఘట్టం

సార్వత్రిక ఎన్నికల తొలిఘట్టం ముగిసింది. జిల్లాలోని పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు 75 మంది అభ్యర్థులు 105 నామినేషన్లను దాఖలు చేశారు. అరకు పార్లమెంట్ స్థానానికి 24 మంది 37 నామినేషన్లు సమర్పించినట్టు జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి సక్రమంగా ఉన్న నామినేషన్లు, తిరస్కరణకు గురైన వాటి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

- పూర్తయిన నామినేషన్ల పర్వం
- అరకు పార్లమెంట్‌కు 37..
- పాడేరు అసెంబ్లీకి 35, అరకు 44, రంపచోడవరానికి 26 నామినేషన్ల దాఖలు
- ఆరు కొత్త పార్టీల నుంచి బరిలో అభ్యర్థులు
- గత ఎన్నికల్లో కన్నా పెరిగిన నామినేషన్ల సంఖ్య
- ప్రశాంత వాతావరణంలో స్వీకరణ
- కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు



పార్వతీపురంలో నామినేషన్ సమర్పించేందుకు అట్టహాసంగా వెళ్తున్న అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి, పార్టీ శ్రేణులు (ఫైల్)

సాక్షి,పాడేరు/పాడేరు/ రంపచోడవరం: వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధానమైన నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. జిల్లాలో అరకు పార్లమెంట్‌తో పాటు పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీకి ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. అరకు పార్లమెంట్‌కు సంబంధించి పార్వతీపురం కలెక్టరేట్‌లో ఆర్వో నిశాంత్‌కుమార్, పాడేరు అసెంబ్లీకి జాయింట్ కలెక్టర్, ఆర్వో భావన వశిష్ట, అరకు అసెంబ్లీకి పాడేరు ఐటీడీఏలో పీవో, ఆర్వో అభిషేక్, రంపచోడవరానికి సంబంధించి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్వో ప్రశాంత్‌కుమార్ నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల చివరిరోజు గురువారం అరకు పార్లమెంట్‌కు 10, పాడేరు అసెంబ్లీకి 12, అరకులోయ అసెంబ్లీకి 11, రంపచోడవరం అసెంబ్లీకి 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

- గత ఎన్నికలతో పోల్చుకుంటే అరకు పార్లమెంట్ తోపాటు అరకు అసెంబ్లీకి నామినేషన్ల సంఖ్య పెరిగింది.
- 2019 ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు ప్రక్రియ సమయంలో ఘర్షణలు జరిగాయి. అయితే ఈఏడాది పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. దీనివల్ల ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. ర్యాలీల నిర్వహణ సందర్భంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.
- ఈ ఎన్నికల్లో కొత్తగా జయభారత్ నేషనల్ పార్టీ, గొండ్వన దండకారణ్య, తెలుగు రాజ్యాధికార సమితి, సమాజ్‌వాదీ, ఇండియన్ ప్రజాబంధు, భారత్ ఆదివాసీ పార్టీల నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

అరకు పార్లమెంట్‌కు 24 మంది.. 37 నామినేషన్లు

అరకు పార్లమెంట్ స్థానానికి మొత్తం 24 మంది అభ్యర్థులు 37 నామినేషన్లు సమర్పించారు. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత నాలుగు సెట్లు, సీపీఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరస రెండు సెట్లు, గొండ్వన దండకారణ్య పార్టీ అభ్యర్థి బిడ్డిక రామారావు 4 సెట్లు, బీఎస్పీ అభ్యర్థి వారం అవస్య లహరి, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థి జల్లి రాంబాబు, జయభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి బడ్నాయిని చంటిబాబు, ఇండియన్ ప్రజాబంధు పార్టీ అభ్యర్థి యువక చెంచు, భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థి మొట్టడం రాజబాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి అతిథితో పాటు 16మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు అందజేశారు.

పాడేరు అసెంబ్లీకి 28 మంది.. 35 నామినేషన్లు

పాడేరు అసెంబ్లీకి చివరిరోజు 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ,కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను ఆర్వో ఆర్‌వో భావన వశిష్టకు అందజేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి చివరిరోజు వరకు 28 మంది అభ్యర్థులు 35 నామినేషన్ల అందజేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, టీడీపీ, కాంగ్రెస్‌తో పాటు , సమాజ్‌వాది పార్టీ నుంచి మినుముల రాంబాబుతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ల వేశారు.

అరకు అసెంబ్లీకి 30 మంది.. 44 నామినేషన్లు

అరకు అసెంబ్లీకి సంబంధించి చివరి రోజు గురువారం 12 నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్వో అభిషేక్ తెలిపారు. కాంగ్రెస్ తరపున శెట్టి గంగాధరస్వామి, బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు కమిడి నిర్మల, సమర్థి గులాబీ, వంతాల రామన్న, చెండా ఏలియా, పి.రామకృష్ణ, మొస్య సుజాత, తాంగుల రామరాథ్, దురియా సాయిబాబా, సమర్థి భవాని ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటివరకు 44 నామినేషన్లు దాఖలయ్యాయి.

నేడు నామినేషన్ల పరిశీలన

జిల్లాలోని అరకు పార్లమెంట్, పాడేరు,అరకు, రంపచోడవరం అసెంబ్లీకి దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలన జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత తెలిపారు. సాయంత్రానికల్లా సక్రమంగా ఉన్న నామినేషన్ల వివరాలను పార్వతీపురం మన్యం జిల్లా, పాడేరు, అరకు, రంపచోడవరం రిటర్నింగ్ అధికారులు తెలియజేస్తారని ఆమె పేర్కొన్నారు.

రంపచోడవరం అసెంబ్లీకి 17 మంది.. 26 నామినేషన్లు

రంపచోడవరం అసెంబ్లీకి చివరి రోజు గురువారం 14 నామినేషన్లు అందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 17 మంది అభ్యర్థులు 26 నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి రెండు సెట్లు, టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి రెండు సెట్లతో డమ్మీ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులు 14 మంది నామినేషన్లు సమర్పించారు.

నామినేషన్ల ప్రక్రియపై సంతృప్తి



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న అరకు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు వివేకనందన్

పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అరకు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకుడు కె. వివేకనందన్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

అభ్యర్థుల ప్రచార వ్యయంపై నిరంతర నిఘా

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్

సాక్షి,పాడేరు: ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌పై ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. అన్ని విభాగాల అధికారుల విధులపై సమీక్షించారు. కలెక్టర్ విజయసునీత, ఇతర అధికారులతో ఆయన మాట్లాడారు. పలు అంశాలపై సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు,టీవీ చానళ్లను నిరంతరం పరిశీలించి ఆయా రాజకీయ పార్టీలు,అభ్యర్థుల ప్రకటనల వ్యయాన్ని లెక్కించాలన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు కూడా క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, పలు విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎంగా సందీప్



తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్(డీసీఎం)గా కె.సందీప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీనియర్ డీసీఎంగా పనిచేసిన అఖిలేష్ కుమార్ త్రిపాఠి సంబల్‌పూర్ డివిజన్‌కు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. సందీప్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ద్వారా రైల్వేలో ప్రవేశించారు. ఈయన 2013 ఇండియన్ సివిల్ సర్వీస్ బ్యాచ్‌కు చెందినవారు. ఇంతకు ముందు ఈయన ఖుర్దారోడ్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేశారు. రైల్వేలో అసిస్టెంట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన సందీప్ ఈస్ట్ కోస్ట్ రైల్వేలో పలు హోదాలతోపాటు వాల్తేర్ డివిజన్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఏరియా మేనేజర్‌గా కూడా గతంలో పనిచేశారు.

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా మచిలీపట్నం–విశాఖపట్నం–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. మచిలీపట్నం–విశాఖపట్నం(17219) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి మే 26వ తేదీ వరకు, విశాఖపట్నం–మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 27వ తేదీ వరకు రద్దయింది.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల బాలుర ప్రతిభ

మధురవాడ/ముంచంగిపుట్టు: కాస్త ప్రోత్సహిస్తే ఎవ్వరితోనైనా పోటీ పడగలమని నిరూపించారు మారికవలసలోని ఏపీ గిరిజన గురుకుల శిక్షణ సంస్థకు చెందిన విద్యార్థులు. ఐఐటీ జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 29 మంది పరీక్షలకు హాజరు కాగా 11 మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు క్వాలిఫై అయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పెద్ద తమ్మింగలకు చెందిన వంతల కుశబాబు 86.42 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 2,679వ ర్యాంకు సాధించాడు. పి.నరేష్ 78.33, పీఎల్ఎన్ బోటీ 70.38 పర్సంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్ తెలిపారు. 80 పర్సంటైల్ పైన ఒకరు, 70కిపైన 2, 60 పర్సంటైల్‌కు పైన నలుగురు సాధించినట్లు వివరించారు. వీరిని ఐటీడీఏ పీవో అభిషేక్ అభినందించారు.

స్పేస్ ఇంజనీర్ అవుతా..



మాది నిరుపేద కుటుంబం. నాన్న డుంబు, అమ్మ దేవకి వ్యవసాయ కూలీలు. అమ్మానాన్నలు ఎంతో కష్టపడి నన్ను చదివించారు. వారి కలలను నెరవేరుస్తాను. జేఈఈ మెయిన్స్‌లో 86.42 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 2,679 ర్యాంకు వచ్చినందుకు ఆనందంగా ఉంది. నేను మరింత బాగా చదివి స్పేస్ ఇంజనీర్ అవుతాను.

–వంతల కుశబాబు, మారికవలస గిరిజన గురుకుల ట్రైనింగ్ సెంటర్

అడుగంటిన మత్స్యగెడ్డ

- మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్ట్‌కు నీటి గండం



కుమ్మరిపుట్టు వద్ద ఎండిపోయిన మత్స్యగెడ్డ

ముంచంగిపుట్టు: నిత్యం నీటితో కళకళలాడే మత్స్యగెడ్డ అడుగంటితోంది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు జలాశయం మత్స్యగెడ్డపైనే ఆధారపడి ఉంటుంది.ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో మత్స్యగెడ్డ ఎండిపోతోంది. సుజనకోట, పెదగూడ, దార్రెల, పనసపుట్టు, దొడిపుట్టు పంచాయితీల మీదుగా ప్రవహించే మత్స్యగెడ్డలో ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదని స్థానికులు చెబుతున్నారు.

మలేరియా రహిత మన్యమే లక్ష్యం

- డాక్టర్ జమాల్‌బాషా
- పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహణ



పాడేరులో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు: మలేరియా రహిత మన్యంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక పాత బస్టాండ్ వద్ద మలేరియా అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా గణనీయంగా తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రతిఒక్కరు క్రిమి సంహారక దోమతెరలు వాడేలా ప్రజలను చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా కూడా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. మొదటి విడత దోమల నివారణ మందు పిచికారి కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, సహాయ మలేరియా అధికారి డి. శేషయ్య, పాడేరు సబ్ యూనిట్ అధికారి బి. ధనుంజయ్, మలేరియా సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కుటుంబాల చేరిక



మాజీ ఎంపీటీసీ దేవిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: మండలంలో టీడీపీకి చెందిన మాడగడ పంచాయతీలో మాజీ ఎంపీటీసీ వంతల దేవితోపాటు నందిగుడ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, పెదలబుడు పంచాయితీ పితమామిడివలసకు చెందిన మరో 60 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన మెచ్చి వైఎస్సార్ సీపీలోకి వచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శత్రుఘ్న తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ న్యాయమూర్తుల బదిలీ

విశాఖ లీగల్: విశాఖలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ న్యాయమూర్తులకు బదిలీ అయింది. మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శ్రీనివాసరావుకు విజయనగరం స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తి జి.కార్తీక బదిలీపై వస్తున్నారు. ఐదో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి యు.మాధురి శ్రీకాకుళం జిల్లా పలాస జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూరి సింధు గుర్రం బదిలీపై వస్తున్నారు. గాజువాక జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న వై.ప్రేమలత విజయనగరం జిల్లా చీపురుపల్లి జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.ప్రదీప్ బదిలీపై వస్తున్నారు.

భలె భలె ఒంటె!



రాజస్థాన్‌లో కనిపించే ఎడారి ఓడ రాజవొమ్మంగిలో ప్రత్యక్షమవడంతో చిన్నారులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. నెల్లూరు జిల్లా కలవాయి గ్రామానికి చెందిన పద్మావతి, అన్నమయ్య, రమణయ్య ఒంటెతో ఊరూరా తిరుగుతూ వచ్చే ఆదాయంతో ఉపాధి పొందుతున్నారు. ఒంటెతో విన్యాసాలు చేయిస్తూ ఆకట్టుకుంటున్నారు. దీనిలో భాగంగా వారు గురువారం రాజవొమ్మంగి రావడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో చిన్నారులంతా ఒంటె వెంట తిరుగుతూ సందడి చేశారు. – రాజవొమ్మంగి



2019లో హుకుంపేట మండలం శోభకోట పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ లక్ష్యం.. 80 శాతం..

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం 80 శాతానికి మించి నమోదయ్యేలా ఓటర్లకు అవగాహన, చైతన్య కార్యక్రమాలను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. గత ఎన్నికల్లో తగ్గదలకు కారణాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు ఆ పరిస్థితి ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. లక్ష్యానికి మించి ఓటింగ్ శాతం పెరిగేలా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత తెలిపారు.

- అంతకు మించి జరిగేలా ప్రణాళిక
- గత ఎన్నికల్లో తగ్గడంతో అధికార యంత్రాంగం అప్రమత్తం
- అవగాహన, చైతన్య కార్యక్రమాలు విస్తృతం
- ఓటర్లకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాలు

సాక్షి,పాడేరు: వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 80 శాతానికి మించి పోలింగ్ జరిగేలా జిల్లా యంత్రాంగం ప్రణాళికపరంగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ నుంచి ప్రత్యేక ఆదేశాలు అందడంతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయసునీత జిల్లాలోని మండల రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

తక్కువ నమోదుతో అప్రమత్తం

- 2019 ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీకి సంబంధించి అతి తక్కువగా 61.91శాతం పోలింగ్ నమోదైంది. అరకు అసెంబ్లీ స్థానానికి సంబంధించి 71.34 శాతం, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి 77.47 శాతం పోలింగ్ నమోదైంది. అప్పటి పరిస్థితికి ప్రస్తుత పరిస్థితికి ఎంతో వ్యత్యాసం ఉంది. రహదారులు, మౌలిక వసతులు లేని గ్రామాలు ఎన్నో ఉండేవి. ఇప్పుడు పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాలతో అల్లూరి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లా ఏర్పాటైంది. పాడేరు ఐటీడీఏ పరిధిలో మిషన్ కనెక్ట్ పేరుతో శిఖరాగ్ర గ్రామాలకు సైతం రహదారి వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు ముందస్తుగానే అప్రమత్తమయ్యారు. పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు సౌకర్యవంతంగా ఏర్పాటుచేశారు.

పకడ్బందీగా పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు

- జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. మావోయిస్టులు, సానుభూతిపరులు, మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోంది. దీనివల్ల వారి ప్రభావం కూడా పూర్తిగా తగ్గింది. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బూత్ లెవెల్ అధికారులు ఓటు నమోదుపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన జంక్షన్లు, బస్టాండ్లు, వారపు సంతల్లో కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. కరపత్రాల ద్వారా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా నోడల్ వ్యవస్థ పనిచేస్తోంది.

పోలింగ్ శాతం పెంపునకు కృషి



జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోలింగ్‌శాతం పెంచాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టాం. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల చైతన్య కార్యక్రమాలను విస్తృతం చేశాం. మారుమూల గ్రామాల ఓటర్లపై మరింత దృష్టి పెట్టాం. గతంతో పోల్చుకుంటే రహదారులు నిర్మాణం, రవాణా వ్యవస్థ మెరుగుపడింది. ఓటర్లంతా తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎం.విజయ సునీత, కలెక్టర్, పాడేరు



ఓటు హక్కు వినియోగంపై చైతన్యం పొందిన ఓటర్లు

జిల్లాలో ఓటర్లు ఇలా..

- జిల్లాలో 1021 పోలింగ్ కేంద్రాల పరిధిలో 7,69,098 ఓటర్లు ఉన్నారు.మరో 10,780 మంది ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇవి అధికారుల పరిశీలనలో ఉన్నాయి. పాడేరు అసెంబ్లీ పరిధిలో 318 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీరిలో 1,19,543 మంది పురుషులు, 1,28,298 మంది మహిళలు, 16 మంది ఇతరులు, మొత్తం 2,47,857 మంది ఓటర్లు ఉన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,31,509 మంది పురుషులు,1,44,975 మంది మహిళలు,16 మంది ఇతరులు, మొత్తం 2,76,500 మంది ఓటర్లు ఉన్నారు. అరకు నియోజకవర్గ పరిధిలో 304 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,19,079 మంది పురుషులు,1,25,655 మంది మహిళలు, ఏడుగురు ఇతరులు, మొత్తం ఓటర్లు 2,44,741 మంది ఉన్నారు.

2019లో పోలింగ్ వివరాలు

- పాడేరు: నియోజకవర్గంలో 2,27,042 మంది ఓటర్లు ఉండగా 1,40,616 (61.91) ఓట్లు పోలయ్యాయి.
- అరకులోయ: నియోజకవర్గంలో 2,20,773 మంది ఓటర్లు ఉండగా 1,57,575 (71.34) ఓట్లు పోలయ్యాయి.
- రంపచోడవరం: నియోజకవర్గంలో 2,60,380 మంది ఓటర్లు ఉండగా 2,01,712 (77.47) ఓట్లు పోలయ్యాయి.

ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత

పాడేరు : గురువారం విడుదలైన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఇంటర్మీడియట్, టెన్త్ ఫలితాల్లో అల్లూరి సీతారామారాజు జిల్లాకు ఉత్తమ స్థానాలు వచ్చాయని జిల్లా ఇన్‌చార్జి డీఈవో వై. వినయ్‌మోహన్ తెలిపారు. ఓపెన్ ఇంటర్‌లో జిల్లా వ్యాప్తంగా 2,130 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,753 మంది విద్యార్థులు పాస్ అయ్యారని 81.95 శాతం మార్కులతో రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచిందన్నారు. ఓపెన్ టెన్త్‌లో 1707 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 1241 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 72.70శాతంతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచిందని స్పష్టం చేశారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరులో గురువారం ఏపీఆర్ఎస్ కాట్, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. తలార్‌సింగ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గిరిజన బాలికల పాఠశాల, గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5,6,7,8 తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటల వరకు ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ సెట్ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి వై.వినయ్ మోహన్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 196 మంది, మధ్యాహ్నం 616 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వైఎస్సార్‌సీపీతోనే గిరిజనుల అభ్యున్నతి



వంతాల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



గ్రామస్తులతో అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, నాయకులు

అరకులోయ రూరల్: జగనన్న ప్రభుత్వంతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని సిర్గం పంచాయతీ కోడి పుంజువలస, నడిమివలస, సిర్గం, వర్ర, తెంగడవలస గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే అని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న పాలనలోనే బడుగు, బలహీనవర్గాల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజా రాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను (రేగం మత్స్యలింగ)ను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, సర్పంచ్ కాంతమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, నాయకులు ప్రకాష్‌రావు, చిరంజీవి, గురుమూర్తి, అర్జున్, నర్సింగ్, రఘు, పూర్ణ, విజయ్‌కుమార్, రామ్మూర్తి, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపిద్దాం–జగనన్నకు బహుమతిగా ఇద్దాం

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలో వంతాల పంచాయతీ చింతగొంది, వంతాల,డేగలరాయి, గంటరాయి గ్రామాల్లో గురువారం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతి జగనన్న ప్రభుత్వంలోనే జరిగిందని, వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, గూడెం కొత్తవీధి జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కళ్యాణం, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, నాయకులు కురుసా పార్వతమ్మ, గిడ్డి విజయలక్ష్మి, మన్మథరావు, చిన్నారావు, నారాయణరావు, శ్రీను, రమణారావు, కొండబాబు, రమణ, బాలు, సర్పంచ్‌లు తదితరలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య



ర్యాంకులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులతో ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: విద్యతో మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో డివిజన్ స్థాయిలో ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయిలో 570 మార్కులతో మొదటిస్థానం సాధించిన వేలు వసుంధరకు రూ.7 వేలు, 560 మార్కులతో రెండోస్థానం సాధించిన పాడియం నవ్యకు రూ.6 వేలు, 559 మార్కులతో మూడో స్థానం సాధించిన బొగ్గా హర్షితకు రూ.5 వేలు నగదు బహుమతిని పీవో అందచేశారు. అనంతరం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారడంతో పాటు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. తద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని విద్యలో రాణించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కూడా తమవంతు కృషి చేస్తున్నారని పీవో తెలిపారు. ఏపీవో కంచర్ల సుజాత, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం/అడ్డతీగల: హైవే రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు నరుకుతున్న కారణంగా (ట్రీ కటింగ్) చేపడుతున్న కారణంగా వై.రామవరం, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఈఈ ఎండి యూసుఫ్, ఏఈ దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు కరెంట్ సరఫరా నిలిపివేత

చింతపల్లిరూరల్: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శనివారం విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ వనుము ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవి లైన్లు మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

Explore New Dimension to your Career...

WANTED

PRINCIPAL For DEGREE COLLEGES

Qualified candidates with rich experience in academic & administrative wings.

* Preference will be given to Computers Science Graduates.

FACULTIES to teach B.Sc., BCA, BBA classes in the following subjects in our Degree Colleges in North Andhra District.

* COMPUTER SCIENCE
* ARTIFICIAL INTELLIGENCE
* STATISTICS
* DATA SCIENCE
* BUSINESS ANALYTICS
* MANAGEMENT
* COMMERCE
* TELUGU & ENGLISH

DATA SCIENCE: Data Mining using 'R' programming, Big Data Analytics using Spark, Data Visualization using Tableau.

CODING TRAINERS: Candidates having Good Coding Skills in 'C'Java & Python and having experience in developing Real Time Projects. (Full/Part Time)

LIBRARIAN: Experienced M.L.I.Sc. / B.L.I.Sc. candidates with computer knowledge preferable.

*ARITHMETIC *REASONING *SOFTSKILLS

OFFICE STAFF: *Administratative Officer *Officer Superintendent *Public Relation Officer (PRO) *DTP Operator *Receptionist

ATTRACTIVE SALARY FOR DESERVING CANDIDATES

Interested candidates may send their resume to career@aditya.ac.in immediately.

ADITYA DEGREE COLLEGES

H.O. KAKINADA | www.aditya.ac.in/degree

Ph : +91 73863 36662, 98660 76660

వైఎస్సార్‌సీపీతోనే 'విశాఖ విజన్' సాధ్యం



విజన్ విశాఖ కరపత్రాన్ని చూపుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే విశాఖ నగరం అభివృద్ధి విజన్ సాధ్యమవుతుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ విశాఖ పేరిట కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విశాఖ నగరాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ఐదు అంశాలతో కూడిన కరపత్రాన్ని రూపొందించామన్నారు. పారిశ్రామిక కారిడార్, సమగ్ర పట్టణ ప్రణాళిక, మౌలిక వసతుల కల్పన, ప్రమాణాలతో కూడిన ప్రజాజీవనానికి సామాజిక సదుపాయాలు, సుస్థిర అభివృద్ధితో కూడిన అంశాలను ఇందులో పొందుపరిచినట్టు చెప్పారు. వచ్చే ఐదేళ్ల పాలనలో విజన్ విశాఖ పేరిట వీటిని అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నం అభివృద్ధిపై సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ఆలోచన ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతో రానున్న ఐదేళ్లలో విశాఖ నగర ముఖచిత్రం మారుతుందని బొత్స వెల్లడించారు.

- వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ గెలుపు అనంతరం చేపట్టబోయే కార్యక్రమాలతో కూడి కరపత్రాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు. బొత్స ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలిపించాలని విశాఖ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇంటింటా ఈ కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్యదర్శి జీవీ కృష్ణారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృపాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల/కొయ్యూరు/రాజవొమ్మంగి: జిల్లాలోని జి.మాడుగుల, కొయ్యూరు, రాజవొమ్మంగి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తారెత్తించింది. ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్మేశాయి. ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. జి.మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహించాయి. పిడుగుల వలన ఎటువంటి నష్టం సంభవించకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. భారీ ఈదురుగాలులకు కొయ్యూరు మండలంలోని కాకరపాడులో పెద్దచెట్టు పడిపోయింది. విద్యుత్ సరఫరాకు రెండు గంటల పాటు అంతరాయం కలిగింది. చింతలపూడిలో వడగళ్ల వర్షం కురిసింది. ప్రస్తుతం కురిసిన వర్షంతో పశుగ్రాసం పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజవొమ్మంగిలో సాయంకాలం కురిసిన చిరుజల్లులు కురిశాయి.

చందనోత్సవానికి ఏర్పాట్లు

సింహాచలం: చందనోత్సవం రోజున భక్తులకు ఇబ్బంది లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వచ్చేనెల 10న సింహగిరిపై నిర్వహించనున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను గురువారం నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పరిశీలించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సింహగిరిపై పర్యటించారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శన క్యూ లైన్ల గురించి చర్చించారు. భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేయాలో పరిశీలించారు. సింహగిరి బస్టాండ్ నుంచి లోవతోట మీదగా ప్రారంభమయ్యే ఉచిత దర్శన క్యూకి సమీపం నుంచే సింహగిరికి బస్సులు కూడా తిరిగే ఆస్కారం ఉండడంతో అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చర్చించారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ సురేష్, ఎస్ఐ రామకృష్ణ, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హరి, ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2024కు అర్హులైన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక, కళలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారి నుంచి భారత ప్రభుత్వ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భారతీయ బాలల ఈ ఏడాది జూలై 31వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండి, 18 ఏళ్ల వయస్సు దాటని వారు అర్హులని, ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం, నగదు, ధ్రువీకరణ పత్రం అందజేస్తారని పేర్కొన్నారు. అర్హులైన బాలలు ఈ ఏడాది జూలై 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలు https://awards.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి



కొమరవరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలననే ప్రజలు కోరుకుంటున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కొమరవరం, రాజంపాలెం, కొత్తగంగవరం, పాతగంగవరం గ్రామాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా, పారదర్శకంగా అన్ని వర్గాలకు జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముగింటకే ప్రభుత్వ పాలన అందించిన ఘనత జగనన్నదేనన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి చేశామన్నారు. నాడు–నేడు ద్వారా ఆసుపత్రులు, పాఠశాలలు ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రంపచోడవరం, చింతూరు ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలో గల పలు పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. గంగవరం మండలంలో పది గ్రామ సచివాలయ పరిధిలో ప్రజా సంక్షేమానికి రూ.135 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అయినట్టు చెప్పారు. గంగవరం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్తులకు ఎమ్మెల్యే వివరించారు. మరింత సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్నకు అందరూ మద్దతు తెలపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి ఎమ్మెల్యే ధనలక్ష్మికి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీలు గంగాదేవి, , కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ వై.ఎస్.ప్రసాద్ , సర్పంచ్‌లు రామలక్ష్మి, రాజమ్మ, వెంకటేశ్వర్లుదొర, మాజీ సర్పంచ్‌లు పరదా వెంకటేశ్వరరావు దొర, పాయం వెంకటేశ్వర్లు, కోటం చిన్నాలరావు దొర, పార్టీ జిల్లా కార్యదర్శులు ఏడుకొండలు, దిండి బాబి, మండల కన్వీనర్ అప్పలరాజు, మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్, మహిళా విభాగ అధ్యక్షురాలు శారపు పావని, నాయకులు వెంకటేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

విశాఖ విద్య: వేసవి సెలవుల్లో పాఠశాలలు, జూనియర్ కాలేజీలు తెరవడానికి వీల్లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం పేర్కొన్నారు. విద్యా క్యాలెండర్ పక్కాగా అమలు చేసేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈవో, డీవీఈవో, ఆర్ఐవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు గురువారం వెల్లడించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లు పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. ఇలాంటి వాటిపై కమిషన్ సీరియస్‌గా పరిగణిస్తుందని చెప్పారు. తమకు అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో తరగతులు నిర్వహించినట్లు తేలితే వాటి గుర్తింపు రద్దుతో పాటు కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. పాఠశాల, కాలేజీ విద్య శాఖ ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని సీతారాం సూచించారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువు 30

విశాఖ విద్య: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజును ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించాలని డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఎంలు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థుల వివరాలు, అదే విధంగా పరీక్ష రుసుము తదితర అంశాలను అందరికీ తెలిసేలా పాఠశాలలో నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష ఫీజును గడువులోగా చెల్లించేలా విద్యార్థులకు అవగాహన కల్పించి, సకాలంలో నామినల్ రోల్స్ ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు.

పసుపు సిరులు

- గత ఏడేళ్ల నుంచి ఇదే అధిక ధర
- క్వింటాకు రూ.13,000లకు అమ్మకం
- టన్ను రూ.1,30లక్షలు
- పెరుగుతున్న ధరలు..ఆనందంలో రైతులు



పెదబయలు వారపు సంత మార్కెట్

పెదబయలు: గిరిజన రైతులు పండించిన పసుపు పంట ధర కిలో రూ.130 ధరతో పెదబయలు వారపు సంత మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలో రైతులు సాగు చేసి అధికంగా ఆదాయం పొందే పంటల్లో పసుపు ఒకటి. అయితే కష్టపడి పండిస్తున్న పసుపు సాగుకు ఈ ఏడాది మద్దతు ధర రావడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది సీజన్ ప్రారంభం నుంచి రూ.50 నుంచి రూ.60 ధర క్వింటా పసుపు రూ.6000 ధర ఉండేది. టన్ను రూ.60 వేల ఉండేది. అయితే ఈ ఏడాది ప్రారంభంలోనే రూ.75 నుంచి ప్రారంభం కాగా గత వారం రూ.118 ధరతో అమ్మకం చేసిన రైతులు వారం రోజుల తరువాత రూ.130తో వారపు సంతలో వ్యాపారులు కొనుగోలు చేశారు. గత వారంతో పోలిస్తే కిలోకు రూ.12 ధర పెరిగింది. దీంతో క్వింటాకు రూ.13,000, టన్నుకు రూ.1,30,000 ధరతో వ్యాపారులు కొనుగోలు చేయడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడేళ్ల నుంచి పసుపు ధర 100 మార్కు దాటడం లేదని ఒక్కసారిగా పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరధిలో గత ఏడాది ఈ క్రాప్ బుకింగ్ ప్రకారం 3,100 ఎకరాల్లో 2,138 మంది రైతులు సాగు చేస్తున్నారు. పసుపు ధర ఈ ఏడాది ప్రారంభం నుంచి పెరుగుతోంది. ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.



పెదబయలు వారపు సంతతో కొనుగోలు చేసిన పసుపు



పసుపు కొమ్ములను ఉడికిస్తున్న దృశ్యం

ఆనందంగా ఉంది



తాము పండించిన పసుపు ధర గత ఏడేళ్ల నుంచి వంద మార్కు దాటడం లేదు.గత ఏడాది రూ.55 నుంచి రూ.60 ధరలో పసుపు ధర ఉండేది.గత వారం రూ.118 ధర ఉంటే ఈ వారం రూ.130 ధర పెరగడం ఆనందంగా ఉంది. వారంలో ఒక్కసారిగా రూ. 12 ధర పెరిగింది. పసుపు పంట కష్టంతో పంట సేకరణ, ఉడకబెట్టిన తరువాత ఎండించి రంగు వచ్చేంత వరకు పని చేయాల్సి ఉంటుంది. గతంలో కూలీ ఖర్చులు కూడ వచ్చేది కాదు. ధర పెరగడం ఆనందంగా ఉంది.

– పొయిభ బాలయ్య దొర, సర్పంచ్ కొరవంగి పంచాయతీ,పెదబయలు మండలం

మెలకువలు పాటించాలి



గత ఏడాది పోలిస్తే పసుపు ధర సగానికి సగం పెరిగింది. మండలంలో 3100 ఎకరాల్లో పసుపు సాగు జరుగుతుంది.గతంలో కంటే రైతులు సాగు పద్ధతులు పాటిస్తున్నారు. 25 నుంచి 30 శాతం మంది రైతులు సాధారణ పద్ధతిలో కాకుండా బెడ్ సిస్టమ్ ద్వారా సాగు చేస్తున్నారు. రైతులు ఎండిన పసుపు రంగు వేయడానికి పాత పద్ధతి రాయిలో ఎండించి రాయడం, సంచుల్లో పెట్టి గట్టిగ బాదడం వల్ల కొమ్ములు విరిగి గుండగా అవుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టర్మరిక్ పాలిషంగ్ మిషన్లు వినియోగించాలి.

– బి.శరణ్య మాధురి, హార్టీకల్చర్ అధికారి, పెదబయలు మండలం

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ 2 BHK Flat East Facing Sea View from Balcony 1338 Sft. Plinth. Address : 10-5, SM Towers Shreeram Panorama Hills, Madhurawada. Ph : 94937 04900 [V- 2499]

HOUSE FOR SALE

■ విశాఖపట్నం టౌన్ కొత్తరోడ్ సెంటర్‌లో 155 చదరపు గజముల పాత ఇల్లు అమ్మబడును. (సచివాలయం సందు) సంప్రదించండి సెల్: 6305013932. [T-2043]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11800]

Wanted

■ సెక్యూరిటీ గార్డ్స్ : ఎండాడ, మధురవాడలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతము : 13,000/- PF & ESI కలదు. Age: 25-55 yrs. అర్హత: 10th Pass/Fail. Ph: 97051 56333, 78421 81184. [V-2601]

■ NAD జంక్షన్‌లో నూతనంగా ప్రారంభించబడిన UNISEX GYMలో రిసెప్షనిస్ట్ (F) (టై: ఉ॥ 6-11 గం॥), (సా॥ 4 - 8.30 గం॥), Trainer (M/F) (టై: ఉ॥ 5-30 ని॥ - 11.30 ని॥), (సా॥ 4 గం॥ - 9.30 ని॥) కావలెను. Qlf: 10th - డిగ్రీ, ENGLISH/HINDI రావలెను. Ph: 99087 28752. [V-3723]

■ Job Opportunity : A Fast growing Org. Shortly Opening New Branches in Vizag & Reqd. (1) Sr. Manager. (2) Field Officers. (3) PROs M/F Age : 30+ Yrly Pakage : 5-15 Lakhs (Gego) for Intrw. ✆ : 84315 15341, 95535 29529 [V-786860]

■ సెక్యూరిటీ గార్డులు కావలెను : సాగర్‌నగర్ / దాబాగార్డెన్స్ & జగదాంబ ఏరియాలకు. జీతము : 12,000/- నుండి 14,000/- వసతి & ఇతర సదుపాయాలు కలవు. ✆ 96032 16460 / 81795 52684 [V-3062]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9985193111,9573633520. [M-1233969]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం